సాక్షి కర్నూలు

శనివారం । 25 । నవంబర్ । 2023



భ్రామరికి ఊయల సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీ భ్రమరాంబాదేవి అమ్మవారికి ఊయలసేవను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఊయలలో స్వామిఅమ్మవార్ల మూర్తులను అధిష్టింపజేసి షోడశోపచార పూజలు జరిపారు.



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: నిత్యాన్నదాన పథకానికి నంద్యాలకు చెందిన ఎస్ లక్ష్మమ్మ రూ.1,00,116 శుక్రవారం విరాళంగా అందజేశారు. దాతకు స్వామివార్ల జ్ఞాపికను బహూకరించారు.



పట్టువస్త్రాల సమర్పణ

మహానంది: బ్రహ్మోత్సవాల్లో భాగంగా వైఎస్సార్ జిల్లాలోని బ్రహ్మంమఠంలో వీరబ్రహ్మేంద్రస్వామికి శుక్రవారం మహానందీశ్వరుడి పట్టువస్త్రాలను ఈఓ కాపు చంద్రశేఖరరెడ్డి సమర్పించారు.

న్యూస్‌రీల్

ఒకరు వీఆర్..
మరొకరు డీఎస్‌బీకి బదిలీ

కర్నూలు (టౌన్): కర్నూలు రేంజ్ పరిధిలో ఒక సీఐని వీఆర్‌లోకి, మరొకరిని స్పెషల్‌బ్రాంచ్‌కు బదిలీ చేస్తు శుక్రవారం సాయంత్రం కర్నూలు రేంజ్ డిఐజీ సెంథిల్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న జి. ప్రసాద్‌ను వీఆర్‌కు పంపించారు. అలాగే వీఆర్‌లో ఉన్న పి.నాగరాజు యాదవ్‌ను స్పెషల్ బ్రాంచ్-1కు బదిలీ చేశారు.

రెండవ పట్టణ సీఐగా ఇంతియాజ్ బాషా

కర్నూలు నగరంలోని రెండవ పట్టణ సీఐగా జి. ఇంతియాజ్ బాషను నియమించారు. వీఆర్‌లో ఉన్న ఆయనను రెగ్యులర్ సీఐగా నియమిస్తు శుక్రవారం సాయంత్రం జిల్లా ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్‌చార్జ్ సీఐగా ఇక్కడ శ్రీనివాస్ పనిచేస్తున్నారు.

ఎస్సార్బీసీకి రేపు నీరు విడుదల

పాణ్యం: ఎస్సార్బీసీ ప్రధాన కాల్వకు ఆదివారం నీటిని విడుదల చేస్తున్నట్లు ఈఈ సుభకుమార్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గోరుకల్లు జలాశయం నుంచి నీటిని విడుదల చేస్తున్నట్లు చెప్పారు. రైతులు నీటి వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైభవంగా
దామోదర తులసీ కల్యాణం



కల్యాణోత్సవంలో శ్రీమఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు

మంత్రాలయం: అధిక మాసం శుద్ధ ద్వాదశి పురస్కరించుకుని దామోదర, తులసీ కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. శుక్రవారం రాత్రి శ్రీ మఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థుల నేతృత్వంలో కల్యాణ వేడుక నిర్వహించారు. ఉసిరి, శమీ వృక్షంతో శాస్త్రోక్తంగా వేడుక జరిపారు. వేడుకలో భాగంగా శ్రీ రాఘవేంద్రుల మూల బృందావనం నుంచి ఊరేగింపుగా బయలుదేరారు. శమీ వృక్షం కట్ట చేరుకుని కల్యాణం జరిపించారు. ఈ వేడుక భక్తులకు కనువిందు చేసింది.

మహిళల జీవనోపాధులను పెంచండి

కర్నూలు(అగ్రికల్చర్): స్వయం సహాయక సంఘాల మహిళల జీవనోపాధులను మరింత అభివృద్ధి చేసేందుకు అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సెర్ప్ సీఈఓ ఇంతియాజ్ తెలిపారు. శుక్రవారం విజయవాడ నుంచి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులతో వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సెర్ప్ సీఈఓ మాట్లాడుతూ... మహిళల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. వీటిని మహిళలు సద్వినియోగం చేసుకునే విధంగా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ద్వారా ప్రభుత్వం ఆహార శుద్ధి పరిశ్రమలు స్థాపించుకునే అవకాశం ఉందని, వీటిని మహిళల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఆహారశుద్ధి పరిశ్రమల స్థాపనకు 35 శాతం సబ్సిడీ లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కర్నూలు నుంచి డీఆర్‌డీఏ-వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ సలీమ్‌బాషా, అడిషనల్ పీడీ శ్రీధర్ రావు తదితరులు పాల్గొన్నారు.

వెండి హారతి పళ్లెం బహూకరణ



హారతి పళ్లెంను సమర్పిస్తున్న దాతలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల దేవస్థానానికి కర్నూలుకు చెందిన ఎస్‌పీ రామమోహన్‌రెడ్డి, రమాదేవి వెండి హారతి పళ్లెంను సమర్పించారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ 1.160కిలో వెండితో దీనిని తయారు చేయించినట్లు తెలిపారు. అనంతరం దాతలకు వేదాశీర్వచనం చేసి శ్రీస్వామిఅమ్మవార్ల శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు.

మహానందిలో రేపు కోటి దీపోత్సవం

మహానంది: పుణ్యక్షేత్రంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఈ నెల 26వ తేదీన (ఆదివారం) కోటి దీపోత్సవం, జ్వాలా తోరణం కార్యక్రమాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఈఓ కాపు చంద్రశేఖరరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కార్తీక మాసంలో పౌర్ణమికి ఎంతో విశిష్టత ఉంటుందన్నారు. అందులో భాగంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

2.40 ఎకరాల్లో పండ్లతోటల అభివృద్ధి



నాకు 2.40 ఎకరాల భూమి ఉంది. 2018-19 వరకు వర్షాధారం పంటలు సాగు చేస్తున్నా. 2019-20లో ఉపాధి నిధులతో మామిడితోట అభివృద్ధి చేసుకున్నా. 150 వరకు చెట్లు ఉన్నాయి. గత ఏడాది నుంచి కాపు వస్తోంది. మామిడిలో అంతర పంటలు సాగు చేస్తా. వ్యవసాయ పనులు లేనప్పుడు ఉపాధి పనులకు కూడా వెళ్తంటా. 2023-24లో ఇప్పటి వరకు 90 పని దినాలను వినియోగించుకున్నా. రోజుకు వేతనం రూ.272 లభిస్తోంది. పని దినాలను 150కి పెంచడం చాలా సంతోషం కలిగించింది. – బి.హనుమంతు (ఉస్సేన్), కోల్‌మాన్‌పేట, కోసిగి మండలం

కిరాణా వ్యాపారం చేస్తున్నా



మారెమ్మ పొదుపు గ్రూపులో సభ్యురాలిని. వైఎస్‌ఆర్ ఆసరా, వైఎస్‌ఆర్ చేయూత, వైఎస్‌ఆర్ సున్నా వడ్డీ కింద ఆర్థికంగా చేయూత లభించింది. గతంలో వలస వెళ్లే వాళ్లం. ప్రభుత్వ చేయూతతో కిరాణం వ్యాపారం ఏర్పాటు చేసుకున్నా. అన్ని ఖర్చులు పోను నెలకు రూ.20వేల వరకు నికరాదాయం ఉంటోంది. ఉపాధి పనులను కూడా సద్వినియోగం చేసుకుంటున్నా.

– ఈ.ఈరమ్మ, పల్లెపాడు, కోసిగి మండలం

సూక్ష్మ సేద్యం కలసి వచ్చింది



రెండు ఎకరాల భూమి ఉంది. వర్షాధారం పంటలు కలసి రాక ఐదేళ్ల క్రితం వరకు వలస వెళ్లే వాళ్లం. 2021-22లో ఉద్యాన పంటల వైపు మళ్లాం. 2022-23లో ఏపీఎంఐపీ నుంచి సూక్ష్మ సేద్యం కల్పించుకున్నా. క్యారెట్, ఉల్లి, మిరప, ఇతర కూరగాయలు పంటలు పండిస్తున్నా. ఏడాదికి నికర ఆదాయం రూ.3.38 లక్షలు పొందుతున్నా. వ్యవసాయ పనులు లేనప్పుడు ఉపాధి పనులు కూడా చేసుకుంటా.

– యు.వెంకటేష్, గుండ్లకొండ, దేవనకొండ మండలం

ఆర్థిక చేయూత.. జీవితాలకు భరోసా

డీఆర్‌డీఏ-వైకేపీ, డ్వామా, ఏపీఎంఐపీ కీలక పాత్ర

- 2014-15, 2018-19 నాటితో పోలిస్తే 75 శాతంపైగా తగ్గిన వలసలు
- మొదటి సారి జిల్లాలో 2023-24లో కరువు మండలాలు
- ఉపాధి పనిదినాలు 100 నుంచి 150 దినాలకు పెంపు
- వంద శాతం సబ్సిడీతో పండ్లతోటలు
- మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం
- సూక్ష్మ సేద్యంతో రాణిస్తున్న రైతులు



ఉపాధి నిధులతో అభివృద్ధి చెందిన పండ్లతోట

కర్నూలు(అగ్రికల్చర్): చేతి నిండా పనులు కల్పించడం ద్వారా వలసల నియంత్రణకు జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. ప్రధానంగా పశ్చిమ ప్రాంతంపై దృష్టి సారించిన అధికారులు జీవనోపాధులను అభివృద్ధి చేస్తుండటం విశేషం. జిల్లా నుంచి వలసలు ఉంటున్నప్పటికీ 2014-15, 2018-19 మధ్యకాలంతో పోలిస్తే వలసలు 75 శాతం తగ్గినట్లు స్పష్టమవుతోంది. హంద్రీ నీవా కాలువ నిర్మాణం కూడా వ్యవసాయానికి కలసి వస్తోంది. బోర్లు, బావుల్లో భూగర్భ జలాలు పెరుగుతుండటంతో వివిధ పంటల సాగుతో రైతులు ఊరట చెందుతున్నారు. శ్రీశైలం జలాలతో ఉమ్మడి జిల్లాలోని పలు చెరువులను నింపడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

మెరుగుపడుతున్న మహిళల జీవనోపాధులు

ప్రభుత్వం చేపడుతున్న అనేక సంక్షేమ కార్యక్రమాల ఫలితంగా మహిళల జీవనోపాధులు మెరుగవుతున్నాయి. మహిళల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం వైఎస్‌ఆర్ చేయూత, వైఎస్‌ఆర్ ఆసరా, జగనన్నతోడు, వైఎస్‌ఆర్ సున్నా వడ్డీ రుణాల అమలు వల్ల మహిళలు అనేక వృత్తుల్లో రాణించే అవకాశ ఏర్పడింది. బ్యాంకులు స్వయం సహాయక సంఘాల మహిళలకు లింకేజీ రుణాలు పెద్ద ఎత్తున ఇస్తుండటంతో మహిళలు వ్యాపారులుగా, చిన్న పారిశ్రామికవేత్తలుగా రాణిస్తున్నారు. స్త్రీ నిధి, ఉన్నతి కింద కూడా మహిళల జీవనోపాధుల అభివృద్ధికి ఆర్థిక చేయూత లభిస్తోంది. ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ద్వారా సోలార్ డ్రైయర్లు ఏర్పాటు చేసుకొని ఉపాధి పొందుతున్నారు.

- ➢ బ్యాంకు లింకేజీ కింద ఏటా రూ.600 కోట్ల నుంచి రూ.800 కోట్ల వరకు రుణాలు లభిస్తున్నాయి.
- ➢ వైఎస్సార్ ఆసరా కింద మూడేళ్లలో రూ.272.80 కోట్లు లభించాయి.
- ➢ వైఎస్సార్ సున్నా వడ్డీ కింద 2019-20 నుంచి రూ.140.36 కోట్ల లబ్ధి చేకూరింది.
- ➢ వైఎస్‌ఆర్ చేయూత కింద మూడేళ్లలో రూ.666.50 కోట్ల ఆర్థిక ప్రయోజనం చేకూరడం విశేషం.

సూక్ష్మ సేద్యానికి పెరుగుతున్న ప్రాధాన్యత

వలసల నియంత్రణలో సూక్ష్మ సేద్యం కూడా కీలకంగా మారుతోంది. ఉద్యానపంటలు సాగు చేసుకొని బిందు సేద్య సదుపాయం కల్పించుకుంటే రైతులకు చేతినిండా పని లభిస్తుంది. 2019-20 నుంచి ఆదోని ఏరియా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటి కింద ఉన్న 19 మండలాల్లో 11,777 మంది రైతులకు 12,162 హెక్టార్లకు సూక్ష్మ సేద్యం కల్పించింది. జిల్లా మొత్తంగా 13,671 రైతులకు చెందిన 14,238 హెక్టార్లకు సూక్ష్మ సేద్య సదుపాయం లభించింది. సూక్ష్మ సేద్యానికి ప్రభుత్వం రూ.104.93 లక్షల సబ్సిడీ ఇచ్చింది. 2018-19 వరకు వలస వెళ్తున్న చిన్న, సన్నకారు రైతులు పండ్లతోటలు అభివృద్ధి చేసుకొని సూక్ష్మ సేద్యంతో జీవనోపాధి మెరుగుపర్చుకున్నారు. దేవనకొండ మండలం తువ్వదొడ్డి గ్రామం ఉద్యాన పంటల హబ్‌గా మారింది.

ఉపాధి పనులు, పండ్లతోటల అభివృద్ధి

జిల్లా అభివృద్ధికి, వలసలు నియంత్రణకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఎంతో తోడ్పడుతోంది. వ్యవసాయ కూలీలు, సన్న, చిన్న, మధ్యకారు రైతులకు వ్యవసాయ పనులు లేనప్పుడు ఉపాధి పనులు కల్పించడంతో పాటు స్థిరాస్తుల అభివృద్ధికి పండ్లతోటలను కూడా 100 శాతం సబ్సిడీతో అభివృద్ధి చేస్తుండటం విశేషం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మొదటి సారి జిల్లాలో 24 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రభుత్వం గుర్తించింది. ఈ మండలాల్లో పని దినాలను 100 రోజుల నుంచి రూ.150 రోజులకు పెంచారు. 2023-24లో 92 లక్షల పని దినాలు కల్పించాలనేది లక్ష్యంగా కాగా.. ఇప్పటి వరకు 78,05,620 పని దినాలను కల్పించడం విశేషం. రోజుకు సగటున రూ.265 నుంచి రూ.272 వరకు వేతనం లభిస్తోంది. అంతేగాక చిన్న, సన్నకారు రైతుల స్థిరాస్తులు అభివృద్ధి చేసి వలసలు నియంత్రించాలనే లక్ష్యంతో పండ్లతోటలు అభివృద్ధి చేసుకునే అవకాశం కల్పించారు. 2019-20 నుంచి 2023-24 వరకు 18,732 ఎకరాల్లో పండ్లతోటలు అభివృద్ధి చెందాయి. 2019-20లో 2353 ఎకరాలు, 2020-21లో 2826 ఎకరాలు, 2021-22లో 3348 ఎకరాలు, 2022-23లో 2628 ఎకరాలు, 2023-24లో 7577 ఎకరాల్లో పండ్లతోటలు అభివృద్ధి చెందడం విశేషం.



అభివృద్ధి చెందిన మామిడి తోట

మహిళాభ్యున్నతికి చేయూత



గతంలో ఎప్పుడూ లేని విధంగా మహిళల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. వైఎస్‌ఆర్ చేయూత, జగనన్న తోడు, వైఎస్సార్ సున్నా వడ్డీ, వైఎస్‌ఆర్ చేయూత, వైఎస్‌ఆర్ పెన్షన్ కానుక కార్యక్రమాలు క్రమం తప్పకుండా అమలవుతున్నాయి. ఒక్క కర్నూలు జిల్లాలోనే 2019 నుంచి ఇప్పటి వరకు రూ.6975.11 కోట్లకు పైగా ఆర్థిక ప్రయోజనం లభించింది. బ్యాంకులు కూడా ఉదారంగా రుణాలు ఇస్తున్నాయి. ఈ కారణంగానే మహిళలు వ్యాపారాలు, వృత్తుల్లో విశేషంగా రాణిస్తున్నారు. వలసలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి.

– సలీమ్ బాషా, ప్రాజెక్టు డైరెక్టర్, డీఆర్‌డీఏ-వైకేపీ

వచ్చే నెల 7న సీఎం వైఎస్ జగన్ రాక



కేంద్రీయ విద్యాలయం వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సృజన, సీఎం ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్ తలశిల రఘురాం, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎస్పీ జి.కృష్ణకాంత్ తదితరులు

- బహిరంగ సభకోసం స్థలాల పరిశీలన

కర్నూలు(సెంట్రల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిసెంబర్ 7వ తేదీన కర్నూలు జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. పాణ్యం నియోజకవర్గంలోని కల్లూరు, ఓర్వకల్లు మండలాల్లో ఏదో ఒక ప్రాంతంలో పర్యటించే అవకాశం ఉందన్నారు. జగనన్న విద్యా దీవెన పథకం అర్హులైన విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నగదును జమ చేసే కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని చెప్పారు. సీఎం జిల్లా పర్యటన ఖరారైన నేపథ్యంలో బహిరంగ సభకోసం శుక్రవారం సాయంత్రం కల్లూరు మండలంలో అనువైన ప్రదేశాలను కలెక్టర్ డాక్టర్ జి.సృజన, సీఎం ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్ తలశిల రఘురాం, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్, జేసీ నారపురెడ్డి మౌర్య తదితరులు పరిశీలించారు. కర్నూలు నగరంలోని నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని కేంద్రీయ విద్యాలయం వద్ద సభా వేదిక, ఓమెగా ఆసుపత్రి సమీపంలో హెలిపాడ్ ఏర్పాటు కోసం అనువైన స్థలాలను పరిశీలించారు. ఇప్పటికే కల్లూరు మండలం లక్ష్మీపురం, ఓర్వకల్లు మండలం నన్నూరులోనూ సీఎం సభా వేదిక, హెలిపాడ్ కోసం అనువైన ప్రదేశాలను పరిశీలించారు. పైమూడు ప్రదేశాల్లో ఏదో ఒక ప్రాంతంలో సీఎం సభావేదిక, హెలిపాడ్‌ల ఏర్పాటుకు సీఎం కార్యాలయం అనుమతి కోసం వేచి ఉన్నట్లు అధికారులు చెప్పారు. సీఎం పర్యటకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ జి.కృష్ణకాంత్ తెలిపారు. వేదిక ఖరారైన వెంటనే బందోబస్తు, ప్రొటోకాల్ ప్రకారం చేపట్టాల్సిన పనులను చేపడతామన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, కర్నూలు ఆర్‌డీఓ హరిప్రసాదు, ఆర్అండ్‌బీ ఎస్ఈ నాగరాజు, ఈఈ శ్రీధర రెడ్డి, కల్లూరు తహసీల్దార్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ సేవలు మరింత సరళం

- మధ్యవర్తుల ప్రమేయం లేకుండా 'కార్డ్ ప్రైమ్' విధానం
- వినియోగదారుడే డాక్యుమెంట్‌ను రూపొందించుకునే సదుపాయం
- జిల్లాలోని 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సేవలు ప్రారంభం

కర్నూలు(సెంట్రల్): రిజిస్ట్రేషన్ సేవలు సరళతరమయ్యాయి. అవినీతి, అక్రమాలకు తావులేకుండా వినియోగదారులకు కచ్చితమైన సేవలు అందించేలా కార్డ్ ప్రైమ్ 2.0 ద్వారా నూతన రిజిస్ట్రేషన్ విధానం మంగళవారం నుంచి జిల్లాలోని 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రారంభమైంది. ఇప్పటికే నంద్యాల జిల్లాలోని 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ నూతన సాఫ్ట్‌వేర్ అందుబాటులో ఉంటుంది. ఈ విధానంలో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా వినియోగదారుడే నేరుగా ఆన్‌లైన్‌లో డాక్యుమెంట్ తయారు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో చూపించిన మేర స్టాంపు డ్యూటీ, యూజర్‌చార్జీలు , రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లిస్తే చాలు ప్రక్రియ సులభంగా జరిగిపోతుంది. ఇప్పటి వరకు రిజిస్ట్రేషన్ శాఖతో సంబంధం లేకుండా డాక్యుమెంట్ తయారీ, చలానా కట్టడం వంటివి బయట జరిగేవి. వీటిని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సమర్పిస్తే అక్కడ రిజిస్ట్రేషన్ చేస్తూ వస్తున్నారు. ఈప్రక్రియ పెద్ద ప్రహసనంగా ఉండేది. పైగా మధ్యవర్తుల ప్రమేమం ఎక్కువగా ఉండేది. ఈ అవస్థలకు స్వస్తి పలుకుతూ కార్డ్ ప్రైమ్ 2.0 అనే నూతన విధానాన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది.

20 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి

ఆన్‌లైన్‌లో డాక్యుమెంట్ తయారు చేసుకోవడం కార్డ్ ప్రైమ్ 2.0లో చాలా సులభం. ఆస్తి వివరాలు, పేరు, ఆధార్ వంటి సమాచారాన్ని ఎంటర్ చేస్తే వెంటనే ఆస్తికి సంబంధించిన మార్కెట్ విలువ, స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు, యూజర్ చార్జీలు ఎంత కట్టాలో చూపిస్తుంది. ఆ సొమ్మును ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్, స్టాక్ హోల్డింగ్ ద్వారా చలానా కట్టే అవకాశం ఉంటుంది. అనంతరం రిజిస్ట్రేషన్ టైమ్‌స్లాట్ బుక్ చేసుకొని ఆ సమయానికి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాలి. ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన డాక్యుమెంట్ల సబ్ రిజిస్ట్రార్ పరిశీలించి రిజిస్ట్రేషన్ ప్రక్రియను కొనసాగిస్తారు. ఇందుకోసం కేవలం 20 నిమిషాల సమయం మాత్రమే పట్టే అవకాశం ఉంటుంది.

పారదర్శకత పెరుగుతుంది



భూములు, ఇతర ఆస్తుల విక్రయాల్లో పారదర్శకతను పెంచి వారి ఆస్తులను పరిరక్షించేందుకు కొత్త విధానం దోహదపడుతుంది. దస్తావేజును స్వతహాగా ఎవరికి వారే తయారు చేసుకొని, ఎక్కడ కావాలంటే అక్కడ రిజిస్ట్రేషన్ స్లాట్‌ను బుక్ చేసుకోవచ్చు. సులువుగా తక్కువ సమయంలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి అవుతుంది. అపోహలు వీడి ఈ నూతన విధానానికి డాక్యుమెంట్ రైటర్లు, కక్షిదారులు సహకరించాలి.

– నాగలింగేశ్వరరావు, జిల్లా రిజిస్ట్రార్, కర్నూలు

ఆర్‌యూ ఇన్‌చార్జి వీసీగా ఫజుల్ రహమాన్



ప్రొఫెసర్ ఫజుల్ రహమాన్

కర్నూలు(సెంట్రల్): రాయలసీమ యూనివర్సిటీ ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్‌గా డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌గా పనిచేస్తున్న ఫజుల్ రహమాన్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జె.శ్యామల రావు జీఓ 205 విడుదల చేశారు. ప్రస్తుతం ఆర్‌యూ వీసీగా ఉన్న ప్రొఫెసర్ ఆనందరావు పదవీ కాలం శుక్రవారంతో ముగిసింది. దీంతో ఆయన స్థానంలో నూతన రెగ్యులర్ వీసీ వచ్చే వరకు ఫజుల్ రహిమాన్ ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహించనున్నారు.

సెర్చ్ కమిటీ నియామకం

రాయలసీమ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఎంపికకు ముగ్గురితో కూడిన సెర్చ్ కమిటీని రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 11న నియమించింది. అందులో రాష్ట్ర ప్రభుత్వం తరపున ఎస్వీ యూనివర్సిటీ రిటైర్డ్ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కొలకలూరి ఇనాక్, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ నుంచి ఆచార్య నాగార్జున యూనివర్సిటీ రిటైర్డ్ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కె.వియన్న రావు, యూజీసీ నుంచి తమిళనాడు సెంట్రల్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ముత్తుకలింగన్ కృష్ణన్‌లు ఉన్నారు. వీరు ఆర్‌యూ వీసీ పోస్టుకు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి అందులో ముగ్గురి పేర్లను ప్రభుతానికి పంపుతారు. అందులో ఒకరిని గవర్నర్ చాన్స్‌లర్ హోదాలో వీసీగా నియమిస్తారు.

వీసీ, రిజిస్ట్రార్లను నిలదీసిన తొలగించిన నాన్‌టీచింగ్ స్టాఫ్

రాయలసీమ యూనివర్సిటీలో శుక్రవారం హైడ్రామా నెలకొంది. ఫేక్ సర్టిఫికెట్లతో తొలగించబడిన 17 మంది నాన్ టీచింగ్ ఉద్యోగులు తమను వీసీ ప్రొఫెసర్ ఆనందరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వెంకటసుందరానంద పుచ్చ మోసం చేశారని నిలదీశారు. మొదట వారు తమను విధుల్లోకి తీసుకోవాలని వీసీ, రిజిస్ట్రార్ కార్యాలయాల ఎదుట ఆందోళనకు దిగారు. చివరకు వీసీ కార్యాలయంలోకి దూసుకెళ్లి ఆయనతో వాగ్వాదానికి దిగారు. ఒకనొక దశలో పరిస్థితి చేయిదాటిపోతుందనుకునే సమయంలో పోలీసులు రంగ ప్రవేశం చేసి వారిని బయటకు తీసుకెళ్లారు. మరోవైపు వర్సిటీలో భారీ బందోబస్తు మధ్య చివరి రోజు వీసీ గంటన్నర సమయం మాత్రమే విధులు నిర్వహించారు. అనంతరం నాన్ టీచింగ్ ఉద్యోగుల ఆందోళనలతో ఆయన తొందరగా వెళ్లిపోవడంతో కనీసం వీడ్కోలు సభను కూడా నిర్వహించకపోవడం గమనార్హం.

సంక్షేమ బావుటా



ప్రభుత్వ మేలును మరచిపోలేం



ఐదేళ్ల క్రితం నా భర్త శరణప్ప అనారోగ్యంతో మృతి చెందాడు. నాకు కుమారుడు ఉన్నారు. రోజు వారిగా కూలీ పనులు చేసుకుని కుమారుడిని 6వ తరగతి చదివిస్తున్నాను. నా పుట్టినిల్లు కర్ణాటక రాష్ట్రం మాన్వి తాలుకా వలకలదిన్నె గ్రామం. నా పేరు మీదుగా కర్ణాటకలో ఆధార్ కార్డు ఉంది. వలంటీర్ వీరేష్ ఆధార్ కార్డును కర్ణాటక నుంచి ఇక్కడికి మార్చడంతో నాకు వితంతు పింఛన్ మంజూరైంది. ప్రతి నెలా 1వ తేదీన ఇంటికి వచ్చి పింఛన్ అందిస్తున్నారు. ప్రభుత్వం చేసిన మేలును మరచిపోలేం.

– కొరివి చంద్రమ్మ, కందుకూరు, కోసిగి మండలం

ఇలాంటి మార్పు ఎప్పుడూ చూడలేదు



నేను 30 ఏళ్లుగా ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నా. ప్రభుత్వ పాఠశాలల్లో ఇలాంటి మార్పు నేను ఇదివరకు ఎన్నడూ చూడలేదు. మా పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు 400 మంది విద్యార్థులు ఉన్నారు. విద్యార్థుల సంఖ్య ఏడాదికేడాదికి పెరుగుతోంది. ప్రస్తుతం పాఠశాలలో అధునాత బాత్‌రూమ్స్, టాయిలెట్స్ ఉన్నాయి. విద్యార్థులకు మధ్యాహ్నం నాణ్యమైన భోజనం అందుతోంది. ప్రతి సబ్జెక్టుకు ఉపాధ్యాయుడు ఉన్నాడు. కార్పొరేట్ స్కూళ్ల తరహాలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు విద్య అందుతోంది.

– ఈశ్వరయ్య, ఉపాధ్యాయుడు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల మండగిరి, ఆదోని మండలం

కొండంత అండ



కూలి పనులకు వెళితే కానీ పూట గడవని పరిస్థితి మాది. ఇలాంటి సమయంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు మాకు కొండంత అండగా నిలుస్తున్నాయి. నాకు వైఎస్సార్ చేయూత పథకం కింద రూ.18,750 చొప్పున రెండేళ్ల పాటు రూ.37,500 అందింది. వైఎస్సార్ ఆసరా కింద రూ.7,880 చొప్పున మూడేళ్ల పాటు రూ.23,640 వచ్చాయి. బ్యాంకు లింకేజీ కింద రూ.లక్ష తీసుకున్నా. క్రమం తప్పకుండా సున్నా వడ్డీ వస్తోంది. చేయూత, పొదుపు సొమ్ముతో చిల్లర అంగడి, హోటల్ నడుపుకుంటున్నా. జగనన్న చేస్తున్న మేలును ఎన్నటికీ మరువలేం.

– బనావత్ తులశమ్మ, దేశాయతండ, తుగ్గలి మండలం

క్లుప్తంగా

మగ్గం, ఎంబ్రాయిడరీ, ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌లో ఉచిత శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్): కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత మహిళలకు మగ్గం, ఎంబ్రాయిడరీ, ఫాబ్రిక్ పెయింటింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ బి.శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 30 రోజుల శిక్షణకు 18 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు చదవడం, రాయడం వచ్చిన మహిళలు అర్హులన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, హాస్టల్ వసతి కల్పిస్తామన్నారు. ఆసక్తి కలిగిన మహిళలు మరిన్ని వివరాలకు 63044 91236 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఖనిజం అక్రమ తరలింపును అడ్డుకుంటాం

- జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్

కర్నూలు (న్యూటౌన్): ఖనిజం నిల్వలను అక్రమంగా తరలిస్తే అడ్డుకుంటామని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ అన్నారు. శుక్రవారం డోన్ ప్రాంతంలో ఆకస్మిక తనిఖీలు చేసి రెండు వాహనాలను సీజ్ చేశామన్నారు. చారు. డోన్‌లో మొజాయిక్ చిప్స్ తరలిస్తున్న లారీ, చిగురుమానుమిట్ట దగ్గర డొలమైట్‌ను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను సీజ్ చేసి రూ.50వేలు అపరాధ రుసుం విధించి వసూలు చేసినట్లు చెప్పారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా, రాయల్టీ చెల్లించకుండా ఖనిజ నిల్వలను తరలిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో రాయల్టీ ఇన్‌స్పెక్టర్ బాలు నాయక్ పాల్గొన్నారు.

108లో మహిళ ప్రసవం


శిశువును అప్పగిస్తున్న 108 సిబ్బంది

పాణ్యం: 108 వాహన సిబ్బంది సకాలంలో స్పందించడంతో ఓ గర్భిణి క్షేమంగా వాహనంలోనే బిడ్డను ప్రసవించింది. నంద్యాల మండలం పోలూరు గ్రామానికి చెందిన గర్భిణి తస్లీమాకు నెలలు నిండి శుక్రవారం తెల్లవారుజామున ప్రసవ నొప్పులు ప్రారంభమయ్యాయి. కుటుంబీకులు 108కు ఫోన్ చేయడంతో పాణ్యం 108 సిబ్బంది సకాలంలో గ్రామానికి చేరుకుని గర్భిణిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తస్లీమాకు ఇద్దరు కుమారులు ఉండగా మూడవ కాన్పులో ఆడ బిడ్డ జన్మించింది. తల్లీబిడ్డ సురక్షితంగా ఉన్నట్లు 108 ఈఎంటీ తిరుపాల్, పైలెట్ ప్రసాద్ తెలిపారు.

భార్య కాపురానికి రాలేదని..

బనగానపల్లె రూరల్: భార్య కాపురానికి రాలేదని మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం పలుకూరు గ్రామంలో చోటు చేసుకుంది. నందివర్గం ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఉదయ్‌కుమార్ (30)కు పుసులూరు గ్రామానికి చెందిన లక్ష్మీదేవితో ఏడేళ్ల క్రితం వివాహమైంది. ఉదయ్‌కుమార్ చెడు వ్యసనాలకు బానిసై జులాయిగా తిరిగేవాడు. ఈ కారణంగా ఆరోగ్యం కూడా పాడైపోయింది. ఈ విషయంపై మద్యం మానుకోవాలని వారించినా వినకపోవడంతో రెండేళ్ల నుంచి లక్ష్మీదేవి పుట్టింటిలోనే ఉంటుంది. దీంతో మనస్తాపం చెందిన ఉదయ్‌కుమార్ శుక్రవారం ఇంట్లో ఉరివేసుకుని బలవన్మరణం చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి తండ్రి పెద్ద మద్దయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుత్ సేవలు మరింత చేరువ

- సచివాలయాల్లోనే 14 రకాల సేవలు
- విద్యుత్ మీటర్ నుంచి బిల్లుల చెల్లింపు వరకు
- ట్రాన్స్‌కో, వినియోగదారులకు వారధిగా ఎనర్జీ అసిస్టెంట్లు
- జిల్లాలో 252 మంది ఎనర్జీ అసిస్టెంట్లు
- త్వరితగతిన విద్యుత్ సమస్యల పరిష్కారం


కోవెలకుంట్ల విద్యుత్ సబ్ స్టేషన్


చిన్నకొప్పెర్ల సచివాలయంలో విద్యుత్ సమస్యపై ఫిర్యాదు చేస్తున్న వినియోగదారుడు

కోవెలకుంట్ల: గ్రామ సచివాలయాల్లో విద్యుత్ సేవలను రాష్ట్రప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇప్పటి వరకు విద్యుత్ బిల్లుల చెల్లింపుతోపాటు పలు విద్యుత్ సేవలను పొందేందుకు వినియోగదారులు విద్యుత్ సబ్‌స్టేషన్లు, సెక్షన్ ఆఫీసులు, మీ సేవ కేంద్రాల్లో వెళ్లేవారు. ఈ కష్టాలను తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం వార్డు, గ్రామ సచివాలయాల్లో 14 రకాల విద్యుత్ సేవలు పొందేలా చర్యలు చేపట్టింది. గ్రామ సచివాలయాల్లో విద్యుత్ సేవలను సులభతరం చేసింది. నంద్యాల జిల్లాలోని 29 మండలాల పరిధిలో 516 గ్రామ, వార్డు సచివాలయాలున్నాయి. వివిధ విద్యుత్ సమస్యలపై విద్యుత్ సబ్‌స్టేషన్లు, మీసేవల చుట్టూ తిరగకుండా గ్రామ, వార్డు సచివాలయాల్లో సేవలు అందుబాటులోకి రావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ కష్టాలకు చెక్

గతంలో పలు రకాల విద్యుత్ సేవలను పొందేందుకు వినియోగదారులు అష్టకష్టాలు పడేవారు. విద్యుత్ సబ్‌స్టేషన్, విద్యుత్ అసిస్టెంట్ ఇంజినీర్ ఆఫీసులు, మీ సేవ కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. సమస్యల పరిష్కారం కోసం రోజుల తరబడి తిరగాల్సి వచ్చేది. ఆ సమస్యలకు చెక్ పెడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సేవలను సైతం గ్రామ సచివాలయాల్లో అందుబాటులోకి తెచ్చింది. పట్టణప్రాంతాల్లో 13 రకాల విద్యుత్ సేవలతోపాటు పల్లెల్లో విద్యుత్ బిల్లుల చెల్లింపును కూడా గ్రామ సచివాలయాలకు అనుసంధానం చేసింది. వినియోగదారులు, విద్యుత్ సంస్థకు మధ్య వారధిగా ఎనర్జీ అసిస్టెంట్లు(గ్రేడ్-2 జేఎల్‌ఎం) కీలక పాత్ర పోషిస్తున్నారు. పట్టణాలు, గ్రామాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా పరిధిలోని ఆయా మండలాల్లో 252 మంది ఎనర్జీ అసిస్టెంట్లు వినియోగదారులకు సేవలందిస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఎనర్జీ అసిస్టెంట్లకు కొన్ని విద్యుత్ సర్వీసులకు సంబంధించి బాధ్యతలు అప్పగించారు. వీరు వినయోగదారులకు నిత్యం అందుబాటులో ఉంటూ 5-10 కిమీ దూరంలో ఉన్న విద్యుత్ లైన్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల పర్యవేక్షణ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడం, విద్యుత్ జంపర్లు తెగిన సమయంలో వాటిని పునరుద్ధరించడం, ట్రాన్స్‌ఫార్మర్లలో తలెత్తిన సమస్యలు పరిష్కరించడం, ఆగిపోయిన, కాలిపోయిన మీటర్ల స్థానంలో కొత్త మీటర్లు ఏర్పాటు, తదితర సేవలందిస్తున్నారు. విద్యుత్‌సరఫరాకు సంబంధించిన సమస్యలపై వినియోగదారులు, వలంటీర్లు సచివాలయాల్లో ఫిర్యాదు చేస్తే అతి తక్కువ వ్యవధిలో సమస్యను గుర్తించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నారు.

సచివాలయాల్లో అందే విద్యుత్ సేవల వివరాలు..

- గృహ, వాణిజ్య విద్యుత్ సర్వీసు కనెక్షన్లకోసం దరఖాస్తు చేసుకోవచ్చు.
- వ్యవసాయ విద్యుత్ సర్వీసు కనెక్షన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు.
- విద్యుత్ సర్వీసుల్లో ఉన్న కేటగిరీలను మార్పుచేసుకునే సౌకర్యం.
- విద్యుత్ సర్వీస్‌కోసం పేరు మార్చుకునే సౌకర్యం.
- అదనపు విద్యుత్ లోడ్ కోసం దరఖాస్తు అందజేయవచ్చు.
- మీటర్ అధికంగా తిరుగుతుంటే టెస్టింగ్ చేసుకునే సౌకర్యం.
- కాలిపోయిన విద్యుత్‌మీటర్ స్థానంలో కొత్త దానికి దరఖాస్తు చేసుకోవచ్చు.
- విద్యుత్ బిల్లులో వచ్చిన సమస్యలపై ఫిర్యాదు చేసుకునే సౌకర్యం.
- ట్రాన్స్‌ఫార్మర్లకు సంబంధించిన ఫిర్యాదులు తెలియజేవచ్చు.
- హై,లో ఓల్టేజీ సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చు.
- విద్యుత్ లైన్లను మార్చడం కోసం ఫిర్యాదు చేసే సౌకర్యం.
- శిథిలావస్థకు చేరుకున్న స్తంభాలను మార్చేందుకు ఫిర్యాదు చేయవచ్చు.
- విద్యుత్ మీటర్ ఆగిపోవడం, నెమ్మదిగా తిరగడం, వేగంగా తిరగడం వంటి సమస్యలను తెలియజేవచ్చు.
- గ్రామాల్లో విద్యుత్ బిల్లుల చెల్లింపుల సౌకర్యం.

శుభపరిణామం



రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సచివాలయాల ద్వారా విద్యుత్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. గతంలో విద్యుత్‌కు సంబంధించి ఏ సమస్య వచ్చినా కరెంట్ ఆఫీసు చుట్టూ తిరిగాల్సి వచ్చేది. ఆ సమస్య లేకుండా గ్రామ సచివాలయాల్లోనే 14 రకాల సేవలు అందుతుండటం శుభ పరిణామం.

– దస్తగిరి, వినియోగదారుడు, కోవెలకుంట్ల

వ్యయప్రయాసలు తగ్గాయి

గతంలో విద్యుత్ బిల్లును కలుగొట్ల ట్రాన్స్‌కో ఆఫీస్‌కు వెళ్లి కట్టేవాళ్లం. ప్రస్తుతం గ్రామ సచివాలయంలోనే విద్యుత్ బిల్లు కట్టే సదుపాయం కల్పించారు. దీంతో వ్యయ, ప్రయాసలు తగ్గాయి. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సచివాలయాల ద్వారా అన్ని రకాల సేవలు అందిస్తోంది.

– దినకర్, వినియోగదారుడు, వల్లంపాడు, కోవెలకుంట్ల మండలం

సేవలను వినియోగించుకోండి



గ్రామ సచివాలయాల్లో అందుతున్న 14 రకాల విద్యుత్‌సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలి. గృహ, వ్యవసాయ విద్యుత్ మీటర్లు, విద్యుత్ బిల్లులు, ఇతర విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేస్తే ఎనర్జీ అసిస్టెంట్లు త్వరితగతిన సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు.

– రామమోహన్, ట్రాన్స్‌కో ఏఈ, కోవెలకుంట్ల

పాముకాటుతో వలంటీర్ మృతి


సురేఖ (ఫైల్)

తుగ్గలి: పి.కొత్తూరుకు చెందిన వలంటీర్ సురేఖ(32) పాము కాటుతో మృతి చెందింది. మూడు రోజుల క్రితం ఇంటి సమీపంలో పాము కాటు వేయడంతో చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు అనంతపురానికి తరలించారు. అక్కడి చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందింది. మృతురాలికి భర్త హరినాథ రెడ్డి, కూతురు, కుమారుడు ఉన్నారు. వలంటీర్ మృతితో గ్రామంలో విషాదం నెలకొంది. కుటుంబ సభ్యులు రోదనలు మిన్నంటాయి. వైఎస్సార్‌సీపీ నాయకుడు జగన్నాథరెడ్డి వలంటీర్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

భారీగా గుట్కా ప్యాకెట్ల దహనం


జమ్మిచెట్టు వద్ద గుట్కాలను కాల్చివేస్తున్న ఒకటవ పట్టణ పోలీసులు

కర్నూలు (టౌన్): ఇటీవల ఒకటవ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో పలు షాపులపై దాడి చేసి స్వాధీనం చేసుకున్న గుట్కా ప్యాకెట్లను పోలీసులు దహనం చేశారు. అందిన సమాచారం మేరకు ఇటీవల దాడులు చేయగా దాదాపు టన్ను నిషేధి గుట్కా ప్యాకెట్లు నిల్వలు బయటపడ్డాయి. ఈ మేరకు షాపులపై కేసులు నమోదు చేశారు. కోర్టు ఆదేశాల మేరకు స్వాధీనం చేసుకున్న గుట్కా ప్యాకెట్లను పోలీసులు శుక్రవారం సాయంత్రం స్థానిక జమ్మిచెట్టు సమీపంలో బహిరంగంగా దహనం చేశారు. నిషేధిత గుట్కాలను విక్రయిస్తే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని ఒకటవ పట్టణ సీఐ పవన్‌కుమార్ వెల్లడించారు.

ఇండస్ట్రియల్ పార్క్‌కు భూములను గుర్తించండి

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ

నంద్యాల: జిల్లాలో ఇండస్ట్రియల్ పార్క్‌కు అవసరమైన భూములను గుర్తించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ జిల్లా పరిశ్రమల అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా పరిశ్రమల ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా పరిశ్రమల జిల్లా మేనేజర్ శ్రీనివాస యాదవ్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రవీంద్ర, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ రామలింగారెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోమశేఖర్ ఎస్సీ ఎస్టీ చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ ప్రెసిడెంట్ రాజామహేంద్రనాథ్, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి మంజులవాణి వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కుడా మాస్టర్ ప్లాన్‌లో ఇండస్ట్రియల్ పార్క్‌కు అవసరమైన భూములను గుర్తించడంతో పాటు ఉపాధి అవకాశాలు సృష్టించే సేవా రంగ పరిశ్రమలను ప్రోత్సహించి జిల్లా అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. ఇందుకు సంబంధించి జిల్లాలో 27 సేవారంగ యూనిట్ల పరిశ్రమలకు రూ.1.36 కోట్ల సబ్సిడీ మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. బేతంచెర్ల, ఆళ్లగడ్డ క్లస్టర్లలో పారిశ్రామిక రంగానికి సంబంధించి పరిశ్రమల అభివృద్ధికి ఆటంకంగా ఉన్న అవరోధాలను అధిగమించేందుకు కృషి చేయాలన్నారు. అలాగే జగదుర్తి టెక్స్ టైల్ పార్కు అభివృద్ధికి కూడా చర్యలు చేపట్టాలన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు సంబంధించి ముడి సరుకులు లభ్యమయ్యే ప్రదేశాలను గుర్తించి పరిశ్రమల స్థాపనకు కృషి చేయాలన్నారు. ఎస్సీ ఎస్టీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ రాజమహేంద్రనాథ్ మాట్లాడుతూ పీఎంఈజీపీ స్టాండ్ అప్ ఇండియా, వైఎస్ఆర్ జగన్ అన్న బడుగు వికాసం, పథకాల అమలులో బ్యాంకులో విరివిగా రుణాలు ఇవ్వాలని కోరారు.

యూపీఎస్సీ ఐఈఎస్‌లో కోటపాడు యువకుడి ప్రతిభ

- ఆల్ ఇండియాలో 35వ ర్యాంక్


మేర్వ అనిల్ కుమార్‌రెడ్డి (ఫైల్)


కుటుంబీకులతో అనిల్ కుమార్‌రెడ్డి

శిరివెళ్ల: ఆ యువకుడి లక్ష్యానికి తల్లిదండ్రుల ప్రోత్సాహం తోడైంది. ప్రతిభతో యూపీఎస్సీ ఐఈఎస్‌లో సత్తా చాటి యువతకు ఆదర్శంగా నిలిచారు కోటపాడు యువకుడు. గ్రామానికి చెందిన మేర్వ వెంకటరెడ్డి, నిర్మల దంపతుల చిన్న కుమారుడు అనిల్ కుమార్‌రెడ్డి 2022-23వ సంవత్సరం యూనియన్ పబ్లిక్ సర్వీస్ ఇంజినీరింగ్ విభాగంలో ఆల్ ఇండియాలో 35వ ర్యాంక్ సాధించారు. మూడు దశల్లో ఉన్న పరీక్షలో మొదటి దశ ప్రిమిలినరీ ఈ ఏడాది ఫిబ్రవరి 19న జరిగిగింది. జూన్ 25న జరిగిన మెయిన్ పరీక్షలో సత్తా చాటి ఇంటర్వ్యూ వరకు చేరుకున్నారు. అక్టోబర్ 30న జరిగిన ఇంటర్వ్యూలో ప్రతిభ చాటి ఈ నెల 23వ తేదీన యూపీఎస్సీ ప్రకటించిన తుది ఫలితాలలో 35 ర్యాంక్ సాధించి తన ఆశయాన్ని సాధించారు. కాగా అనిల్ కుమార్‌రెడ్డి ఇప్పటికే పలు పరీక్షలలో సత్తా చాటుతూ ఉన్నత ఉద్యోగాలు సాధించినా తన లక్ష్యం వైపు అడుగు వేశారు. ప్రస్తుతం నేషనల్ బిల్డింగ్ కార్పొరేషన్‌లో ఇంజినీర్‌గా ఎంపికై ఢిల్లీలో విధులు నిర్వహిస్తూనే యూపీఎస్సీ ఐఈఎస్ వైపు దృష్టి సారించి విజయాన్ని అందుకున్నారు. ఇదిలా ఉండంగా అనిల్ కుమార్ సోదరుడు రెండేళ్ల క్రితం మేర్వ సునీల్ కుమార్‌రెడ్డి కూడా యూపీఎస్సీలో పరీక్షలు రాసి ఐఎఫ్ఎస్, ఐఆర్ఎస్‌కు సెలక్ట్‌య్యాడు. ప్రస్తుతం ఇన్‌కం టాక్స్ అసిస్టెంట్ కమిషనర్‌గా బెంగళూరులో పని చేస్తున్నారు. తండ్రి ప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో మేనేజర్‌గా పని చేస్తూ కొన్నాళ్ల క్రితం రిటైర్డ్‌య్యారు. తల్లి నిర్మల బీఎస్సీ వరకు చదివి గృహిణిగా ఉంది. యూపీఎస్సీ ఐఈఎస్‌లో అనిల్ కుమార్‌రెడ్డి సత్తా చాటడంతో గ్రామస్తులు, బంధువులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందిస్తున్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి


లక్ష్మీదేవి (ఫైల్)

దేవనకొండ: గుడిమిరాళ్ల గ్రామంలో ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఎస్‌ఐ భూపాలుడు తెలిపిన వివరాల మేరకు గుడిమిరాళ్ల గ్రామానికి చెందిన జి.ప్రకాష్‌కు పదేళ్ల క్రితం ఆదోని మండలం ఆరేకల్ గ్రామానికి చెందిన గొల్ల చిన్నకిష్టప్ప కుమార్తె లక్ష్మీదేవి(29)తో వివాహమైంది. వీరికి కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. గత కొంతకాలంగా లక్ష్మీదేవిని భర్త, అత్త వేధింపులకు గురి చేశారు. ఈ క్రమంలో గురువారం రాత్రి అనుమానాస్పద స్థితిలో నిప్పటించుకుని మృతి చెందింది. కాగా తమ కుమార్తెను భర్త ప్రకాష్, అత్త ధనలక్ష్మి దారుణంగా కొట్టి హత్య చేసి, అనంతరం కిరోసిన్ పోసి తగలబెట్టినట్లు పోలీసులకు మృతురాలి తండ్రి చిన్నకిష్టప్ప ఫిర్యాదు చేశారు.ఈ మేరకు అనుమానస్పద మృతి కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ముగ్గురు చిన్నారులు తల్లిని కోల్పోవడంతో అనాథలుగా మారారు. గ్రామస్తులు, బంధువులు చిన్నారులని చూసి అయ్యోపాపం అంటూ కన్నీళ్లు పెట్టుకున్నారు.

శునకం.. తీరని శోకం



మనుష్యుల్లోనైనా, పశుపక్ష్యాదుల్లోనైనా అమ్మ ప్రేమకు ఏదీ సాటి రాదు. మాతృత్వపు మమకారానికి నిదర్శనం ఈ సంఘటన. తన బిడ్డలో జీవం లేదని.. ఓ వాహనం దానిని పొట్టన పెట్టుకుందని.. ఎంత లేపినా ఇక లేవదని తెలియని.. ఆ తల్లి శునకం బిడ్డ కోసం తల్లడిల్లింది. ఏ క్షణమైనా లేచి వచ్చి తనతో ఆడుకుంటుందని.. గంటల కొద్ది రోడ్డు పక్కనే వేచి ఉండటం.. అప్పుడప్పుడు విగతజీవిగా ఉన్న బిడ్డ దగ్గరకు వెళ్లి లేపే ప్రయత్నం చేయడం.. ఏదైనా వాహనాలు వస్తే అడ్డుగా వెళ్లే దృశ్యాలను స్థానికులను కలిచివేసింది. ఈ సంఘటన మండల కేంద్రం సి. బెళగల్ శివారులో భారత్ పెట్రోల్ బంక్ వద్ద గురువారం రాత్రి చోటు చేసుకుంది. చివరకు స్థానికుల్లో ఓ వ్యక్తి తల్లి శునకాన్ని పక్కకు పంపి, మరణించిన కుక్క పిల్ల కళేబరాన్ని దూరంగా తరలించారు.

– సి.బెళగల్

అదుపులో కార్లు అపహరించే ముఠా

బొమ్మలసత్రం: హైదారబాద్‌లో ఖరీదైన కార్లు, బైకులను దొంగలించి పట్టణంలో విక్రయించే ముఠా సభ్యులు స్థానిక టూటౌన్ పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. పట్టణానికి చెందిన కొందరు యువకులు హైదరాబాద్ నగరంలో సెల్ఫ్ డ్రైవింగ్‌కు అద్దెకు తీసుకుని తిరిగి వారికి వాహనాలు ఇవ్వకుండా పట్టణంలో విక్రయిస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన ఓ కార్ల వ్యాపారి వద్ద ఫార్చునర్ కారు అద్దెకు తీసుకుని వ్యాపారికి తిరిగి అప్పగించకుండా నంద్యాల పట్టణంలో రూ.30 లక్షలకు విక్రయించారు. ఈ సంఘటనపై సీఐ ప్రభాకర్‌రెడ్డిని వివరణ కోరగా గత రెండు నెలల క్రితం ఇలాగే 8 కార్లు విక్రయించిన ముఠాను జైలుకు పంపామని అయినప్పటికీ కొందరు యువకుల్లో మార్పు రావటం లేదన్నారు. అలాగే ఇంటి ముందు సైడ్‌లాక్ వేయకుండా నిలిపిన బైకులను దొంగలించి వడ్డీవ్యాపారుల వద్ద తనఖా పెట్టి నగదు తీసుకుంటున్నారన్నారు. ప్రజలు ఇది గమనించి తక్కువ ధరకు కార్లు అమ్మకానికి వచ్చాయని ఆశపడి కొంటే ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని సీఐ హెచ్చరించారు. కార్లు బాడుగకు తీసుకుని మోసాలకు పాల్పడే కొందరని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని సీఐ పేర్కొన్నారు.

కళ్లకు గంతలు కట్టుకుంటే అభివృద్ధి కనిపించదు

- ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత టీడీపీ నాయకులకు లేదు
- కర్నూలు ఎంపీ, మేయర్, ఎమ్మెల్యేలు


మ్యూజిక్ థీమ్ పార్కు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కర్నూలు ఎంపీ సంజీవ్‌కుమార్, మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యేలు హఫీజ్‌ఖాన్, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, సుధాకర్

కర్నూలు (టౌన్): తెలుగు దేశం పార్టీ నాయకులు కళ్లకు గంతలు కట్టుకుంటే అభివృద్ధి ఎలా కనిపిస్తుందని కర్నూలు పార్లమెంటు సభ్యులు డాక్టర్ సంజీవ్‌కుమార్, నగర మేయర్ బీవై. రామయ్య, కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే జరదొడ్డి సుధాకర్ ధ్వజమెత్తారు. ఐదేళ్లు అధికారంలో ఉన్న టీడీపీ నేతలు కర్నూలుకు ఏం అభివృద్ధి చేశారో.. చెప్పాలని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక 44వ వార్డు పరిధిలోని సీతరామనగర్‌లో నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో రూ.80 లక్షలు వెచ్చించి సుందరంగా తీర్చిదిద్దిన బాల సుబ్రమణ్యం మ్యూజిక్ థీమ్ పార్కును కమిషనర్ భార్గవ్‌తేజతో కలిసి వారు ప్రారంభించారు. పార్కులో అందంగా తీర్చిదిద్దిన సంగీత వాయిద్యాల రూపాలు, కాలనీవాసుల కోసం జారుడు బల్ల, ఉయ్యాల, పచ్చని చెట్లు , గడ్డి, ప్లే ఏరియా, ఓపెన్ జిమ్, పార్కు చుట్టు ఎకో ఫ్రెండ్లీ పెయింటింగ్స్‌తో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన సంగీత కళకారుల చిత్రాలను వారు పరిశీలించి నగరపాలక అధికార యంత్రాంగాన్ని అభినందించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ అభివృద్ధి గురించి మాట్లాడే అర్హత తెలుగుదేశం నాయకులకు లేదన్నారు. కర్నూలు నగరం రెండేళ్ల వ్యవధిలోనే రూపు రేఖలు మార్చామన్నారు. త్వరలోనే క్లీన్ సిటీ, గ్రీన్ సిటీగా కర్నూలును రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తామన్నారు. నగరాన్ని సుందరీకరణగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు చెప్పారు. ఆరోగ్యమే మహా భాగ్యమనే నినాదంతో వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చామన్నారు. ఉద్యానవనాల అభివృద్ధితో స్థానిక ప్రజలకు శారీరకంగా, మానసికంగా ఎంతో ఆహ్లాదం ఇస్తుందన్నారు.కార్యక్రమంలో కార్పొరేటర్లు రాజేశ్వర రెడ్డి, వాసు, గోశాల చైర్మన్ ఆదిమోహన్ రెడ్డి, డైరెక్టర్ భాస్కర్‌రెడ్డి, నాయకులు తేర్నేకల్ సురేందర్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, మధుసూదన్, మున్సిపల్ అధికారులు శేషసాయి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి డబ్బులివ్వలేదని..

జూపాడుబంగ్లా: మద్యం సేవించేందుకు డబ్బులివ్వలేదని మండ్లెం గ్రామానికి చెందిన మానందిగారి దావీదు(32) అనే వ్యక్తి ఇంట్లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ మారుతీ శంకర్ తెలిపిన వివరాల మేరకు..మద్యానికి బానిసైన దావీదు కుటుంబాన్ని పట్టించుకోకుండా తిరగేవాడు. మద్యానికి అవసరమైన డబ్బు కోసం భార్యను వేధిస్తూ ఉండేవాడు. ఈ క్రమంలో శుక్రవారం మద్యం సేవించేందుకు భార్య దేబొరాను డబ్బులు అడుగగా ఆమె లేవని చెప్పడంతో ఉరేసుకుని చనిపోతానని బెదిరించాడు. భయపడిన ఆమె అత్తా, మామలను పిలుచుకొచ్చేలోపే దావీదు ఉరేసుకుని మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నేటి నుంచి వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర

కర్నూలు(అర్బన్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలు, సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం, అర్హులైన లబ్ధిదారులకు అవసరమైన సేవలను అందించేందుకు ఈ నెల 25 నుంచి జిల్లాలో 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర' నిర్వహిస్తున్నట్లు నోడల్ అధికారి, జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి తెలిపారు. గోనెగండ్ల నుంచి ప్రారంభం కానున్న ఈ యాత్ర జిల్లాలో 2024 జనవరి 26వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు ఏర్పాటైన కమిటీకి జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన చైర్మన్‌గా వ్యవహరిస్తారని, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన 36 మంది అధికారులు సభ్యులుగా ఉంటారన్నారు. యాత్ర జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పర్యటించేందుకు నాలుగు ప్రత్యేక వ్యాన్లు జిల్లాకు రానున్నాయన్నారు.